క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

పూడూరు: మండల పరిధిలోని సిరిగాయపల్లిలో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఉదయం 10 గంటలకు పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం సమావేశం ఉంటుందని చెప్పారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు బొంరాస్‌పేట సర్వసభ్య సమావేశం

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండునాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ హేమిబాయి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

25న తాండూరు సమావేశం

తాండూరు రూరల్: తాండూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనితగౌడ్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

'విద్యాజ్యోతి'తో పేదలకు ఆర్థికసాయం

కెనరా బ్యాంకు డీజీఎం బాలకృష్ణ



ఆర్థికసాయం అందజేస్తున్న డీజీఎం

నవాబుపేట: విద్యాజ్యోతి పథకం ద్వారా కెనరా బ్యాంకు నుంచి ప్రతీ సంవత్సరం విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు బ్యాంకు డీజీఎం బాలకృష్ణ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని నారెగూడ, గంగ్యాడ, పులుమామిడి జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న తొమ్మిది మంది మెరిట్ విద్యార్థులకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు మరింత ఎత్తుకు ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో నారెగూడ, పులుమామిడి బ్యాంకుల మేనేజర్లు రాజేందర్‌రెడ్డి , మహేందర్, సర్పంచ్ పర్మయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి చక్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విజయం సాధ్యం

ఎస్‌ఐ విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

మోమిన్‌పేట: విద్యతోనే విజయం సాధ్యమని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఏన్కతల జెడ్పీహెచ్‌ఎస్‌లో ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర నాయకుడు మన్నె బ్రహ్మం ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధనకు కష్టపడాలన్నారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాంలు, మధు, అరవింద్, సురేశ్, నాని, బాలరాజ్, మహేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న కార్యదర్శి

కుల్కచర్ల: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుదారులు మధ్యవర్తులను ఆశ్రయించొద్దని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు కాలనీలలో పర్యటించి గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్

కుల్కచర్ల: నిరుపేదలకు కాంగ్రెస్ ఎల్లవేలలా అండగా ఉంటుందని పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. గ్రామానికి చెందిన ముష్టిపల్లి ప్రకాశ్ ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులు ఆధ్వర్యంలో తక్షణ సాయంగా రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, సలీం, మాసయ్య, రాము, నర్సింలు, యాదయ్య, సాయిలు, జంగయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.

సం'క్షేమ'మేనా?

పేదవిద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వం గురుకులాలు, కస్తూర్బాలు ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో సంక్షేమం నేతిబీరకాయల్లో నేతి చందంగా తయారైంది. భోజనాల్లో మెనూ పాటించక పోవడంతో వారికి సరైన పౌష్టికాహారం అందడం లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ హాస్టళ్లపై 'సాక్షి' ప్రత్యేక కథనం

- గుడ్డు లేదు.. పండు ఇవ్వరు
- హాస్టల్‌లో మెనూ పాటించని వైనం
- పట్టించుకోని అధికారులు



ధారూరు: ధారూరు కస్తూర్బాగాంధీలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

ధారూరు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మెనూ అంటేనే తెలియదని విద్యార్థులు వాపోతున్నారు. మెనూ పాటించేందుకు మార్కెట్లో కూరగాయలు దొరకడం లేదనే సాకు చూపుతున్నుఆరు. శనివారం వెజిటేబుల్ కర్రీ, పెసర పప్పు, రసం, పెరుగు, నెయ్యి, పండ్లతో భోజనం పెట్టాయి. కానీ ఇందుకు బదులుగా చామగడ్డ, చారు, పప్పు, రసం మాత్రమే పెట్టారు. అరటి పండ్లు, నెయ్యి అసలే ఉండదు, పెరుగుకు బదులుగా మజ్జిగ పెడతారని విద్యార్థులు చెప్పారు.

తప్పని పరిస్థితులలో తింటున్నాం..

మర్పల్లి: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనాలు వడ్డించడం లేదు. సాక్షి శనివారం సాయంత్రం 7 గంటలకు వసతి గృహంలో వంటకాలను పరిశీలించగా.. శనివారం మెనూ ప్రకారం ఉదయం రాగి జావ ఇవ్వగా మధ్యాహ్నం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. సాయంత్రం 7 గంటలకు అల్పాహారంగా సేమియా ఇచ్చారు. డిన్నర్ మెనూ ప్రకారం అన్నంతో పాటు ఆకుకూరతో కూడిన పప్పు, సాంబర్, మజ్జిగ ఇవ్వాల్సి ఉండగా అన్నం, ఆలుగడ్డ, మజ్జిగ మాత్రమే వడ్డించారు. గుడ్డు, పండు ఇవ్వలేదని విద్యార్థులు చెప్పారు. ఇక్కడ ధారూరు బీసీ వసతి గృహం వార్డెన్ ఇన్‌చార్జీగా ఉన్నారు. ఇక్కడి కామటి పోస్టు ఖాళీగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నట్లు కుక్, స్వీపర్ తెలిపారు.



ధారూరు: పెరుగుకు బదులుగా మజ్జిగ

పాడైన వాటర్ ఫిల్టర్

పెద్దేముల్: మండల పరిధిలోని మారేపల్లి శివారులో కస్తూర్బా పాఠశాలల్లో మొత్తం 363 మంది విద్యార్థినులున్నారు. శనివారం 232 మంది విద్యార్థులున్నారు. మధ్యాహ్న భోజనం బాగానే ఉన్న బియ్యంలో అప్పుడప్పుడు పురుగులు వస్తున్నాయి. శుద్ధి చేసి వండటం జరుగుతుందన్నారు. వాటర్ ఫిల్టర్ పాడవ్వడంతో బయటి నుంచి మినరల్ వాటర్ తెస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

అనంతగిరి: ప్రభుత్వ ఆదేశానుసారం వసతి గృహాల నిర్వహణ ఉండాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారులు బాధ్యతగా పని చేయాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం, భోజనం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వార్డెన్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం, ఏఎస్డబ్ల్యూఓ ఉమాపతి, ఏబీసీడబ్ల్యూ భీంరాజ్, వార్డెన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అందరికీ ఆరోగ్యం ఇంటింటా ఆనందం

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: మండల పరిధిలోని మైలార్‌దేవంపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే ఆనంద్ ఆరోగ్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సొంత ఖర్చుతో పేదల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య రథం ప్రారంభించారని చెప్పారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య రథం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యరథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ప్రభుత్వ వసతులు వినియోగించుకోవాలి

కుల్కచర్ల: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మక్త వెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని మక్త వెంకటపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు అందించడంతో పాటుగా రాగిజావను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, శంకర్, నీల్య తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి

పూడూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పేరెంట్స్ టీచర్ మీటింగ్(పీటీఎం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకు దూరంగా ఉన్న విద్యార్థుల కోసమే ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందున తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇందుకు విద్యాశాఖ ప్రత్యేకంగా లెర్నింగ్ కార్నర్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థిని

పాపన్న గౌడ్ ఆశయాలను సాధిద్దాం



కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు నారాయణగౌడ్

మోమిన్‌పేట: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను సాధిద్దామని గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు నారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని చక్రంపల్లిలో పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నిస్తేనే విజయం సిద్ధిస్తుందనే ఆయన మాటలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాల్‌రాజు గౌడ్, వీరమల్ల గౌడ్, అనంతయ్యగౌడ్, శివరాజ్ గౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాఘవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను'



5కే-రన్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజలు

5కే-రన్‌లో పాల్గొన్న అధికారులు, యువత

తాండూరు టౌన్: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 5కే-రన్ నిర్వహించారు. స్థానిక ఇందిరాచౌక్ నుంచి సెయింట్ మార్క్స్ పాఠశాల వరకు, తిరిగి ఇందిరాచౌక్ వరకు త్రివర్ణ పతాకాలను చేతబట్టుకుని పరుగెత్తారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకోవడం భారత పౌరుడిగా మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా, తహసీల్దార్ తారాసింగ్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ ఖాజా హుస్సేన్, మేనేజర్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

కొడంగల్ రూరల్: శాంతియుతంగా నిరసన చేపట్టిన ఉద్యోగస్తులు అరెస్టు చేయడం సరికాదని ఎస్‌ఎస్‌ఏ(సమగ్ర శిక్షా అభియాన్) ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారి నిసరనకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2012 నుంచి వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాఘవేందర్, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు దస్తప్ప, శ్రీనివాస్, వెంకటయ్య, తిరుమలేశ్, వేణు, శంకరయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.మల్లయ్య, నర్సింలు, హకీం బాల్‌రాజ్, కె.నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఫొటో గ్రాఫర్లు.. చరిత్ర రూపకర్తలు



మోమిన్‌పేట: లూయిస్ మండే డాగూరే చిత్రపటానికి నివాళి



దౌల్తాబాద్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

- సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్స్

మోమిన్‌పేట: ఫొటో గ్రాఫర్లు.. చరిత్ర రూపకర్తలని ఆ సంఘం అంధ్యక్షుడు బస్వరాజ్ అన్నారు. శనివారం ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని హెల్ప్ హాల్ సొసైటీలో ఫొటో గ్రఫీ ఆద్యుడు లూయిస్ మండే డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. వారికి పరీక్ష ప్యాడులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్ల సంఘం ఉపాధ్యక్షుడు మల్లేశం, సంఘ సభ్యులు గోపాల్, అశోక్, మల్లేశ్, శేఖర్, సంగమేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒక ఫొటో వేలమాటలతో సమానం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఒక ఫొటో వేలమాటలతో సమానం అన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫర్లు అశోక్, శివశంకర్, తదితరులున్నారు.

అల్పాహారం పంపిణీ

తాండూరు టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు ఫొట్రోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ మండే డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలో రోగులకు, వారి బంధువులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, సహాయ కార్యదర్శి రాము, శరణు, వెంకటేశం, గోపాల్, అంబదాస్, ఓంకార్‌శివ, అనిల్, మల్లికార్జున్, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కొడంగల్ రూరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ మండే డాగురే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనతరం ఫొటోగ్రఫీ అసోషియేషన్ సభ్యులు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు రాథోడ్ రవి, సభ్యులు అశోక్, నరేశ్‌చారి, సీనియర్ ఫొటోగ్రాఫర్లు మల్లిఖార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: ఎంసీహెచ్ వద్ద రోగులకు అల్పాహారం పంపిణీ



కొడంగల్ రూరల్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

హనుమాన్ మందిర్‌లో అన్నదానం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని హనుమాన్ మందిరంలో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, ఆలయ అర్చకుడు రవీందర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానం

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం చిలుకూరులోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను సామాజిక అంశాలను, పర్యావరణ హితానికి ఉపయోగించుకోవాన్నారు. పర్యావరణ హితంకోసం మట్టి వినాయకులను తయారు చేసి చూపించారు. కళాశాల డీన్ మధుసూదన్‌నాయర్, ప్రిన్సిపాల్ విజయలత, సంధ్య పాల్గొన్నారు.

'సింధు'లో క్యాంపస్ సెలక్షన్స్



నియామక పత్రాలతో విద్యార్థులు

125 మందికి ఉద్యోగాలు

తాండూరు టౌన్: పట్టణంలోని సింధు డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయాదేవి, కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు రంగారావు తెలిపారు. మ్యాజిక్ బస్, ఇండియా ఫౌండేషన్ వారి అనుబంధ సంస్థలు విప్రో, ముత్తూట్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఏబీఐ, సెవెన్ టెక్, కనెక్ట్, జెన్‌ప్యాక్ట్, వెట్రిక్ స్టాప్ కంపెనీల ప్రతినిధులు 220 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 125 మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు.

ముదిరాజ్ సంఘం ప్రచార కార్యదర్శిగా నర్సింలు

కుల్కచర్ల: ముదిరాజ్ సంఘం మండల ప్రచార కార్యదర్శిగా కుల్కచర్ల గ్రామానికి చెందిన పగిడ్యాల నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు చంద్రలింగం, శ్రీనివాస్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని అందుకు పార్టీలకు అతీతంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం నర్సింలు మాట్లాడుతూ.. సంఘం అభ్యున్నతికి నిరంతరం పనిచేస్తానన్నారు.



నర్సింలును సన్మానిస్తున్న సంఘం నాయకులు